ఏండ్లనాటి రోడ్డు మూసివేత

చాలా ఏండ్ల నుంచి ఆ గ్రామ ప్రజలకు ప్రధాన రహదారి ఉండేది. నిత్యం ఆ రోడ్డు గుండానే వారు వెళ్తుండేవారు. అయితే కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక వారికి రోడ్డే లేకుండాపోయింది. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ముండ్ల కంప వేసి.. ఏండ్లనాటి ప్రధాన రహదారిని మూసివేయించాడు. దీంతో నాలుగు కాలనీల ప్రజలకు ఏడాదిన్నర రాకపోకలు నిలిచిపోవడంతో వందలాది కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- పెద్దపల్లి, మార్చి 30 (నమస్తే తెలంగాణ)

ముళ్ల కంప వేసి మూసేసిన కొత్తూరు గ్రామ ప్రధాన రహదారి

- ఏడాదిన్నర క్రితం ముండ్ల కంప వేసిన కాంగ్రెస్ కార్యకర్త
- నాలుగు కాలనీల ప్రజలు వెళ్లకుండా అడ్డగింత
- ఇబ్బందుల్లో వందలాది కుటుంబాలు
- అధికారులకు విన్నవించినా.. పట్టించుకునేవారు కరువు

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో పెద్దపల్లి-కటికెనపల్లి ప్రధాన రహదారిని ఆనుకొని మామిడిపల్లి వీధి ఉంటుంది. ప్రధానంగా ఆర్టీసీ బస్టాప్ వద్ద ఉన్న రహదారి గుండా గ్రామంలోని మామిడిపల్లి, మెతుకువారి వీధి, బోయవీధి, పద్మశాలీ వీధుల్లోని దాదాపుగా 150కుటుంబాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడి ప్రజలు శతాబ్ది కాలంగా ఈ ప్రధాన రహదారి గుండానే వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఇదే రోడ్డుపై 100ఫీట్ల సీసీరోడ్డును సైతం అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. అయితే ఏడాదిన్నర క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చివరి ఇళ్లకు సంబంధించిన వ్యక్తి ఇక్కడి నుంచి రోడ్డు లేదంటూ ప్రధాన రహదారిపై ముళ్ల కంప వేసి మూసివేయించాడు.

* ఆందోళనలో ప్రజలు

గ్రామంలోని మూడు వీధులకు చెందిన ప్రజలు ముళ్ల కంపను తొలగించేందుకు ప్రయత్నించగా, సదరు వ్యక్తి వారితో గొడవకు దిగారు. దీంతో వారు ప్రజావాణి, పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదులు చేసినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. పూర్వకాలం నుంచి ఉన్న రోడ్డును పక్కనపెట్టి.. వెనుక నుంచి రెండు కిలోమీటర్ల దూరం నుంచి వీధిలోకి రావడం ఇబ్బందిగా మారిందని వారు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై జీపీ కార్యదర్శి మల్లేశంను వివరణ కోరగా, తాను గ్రామానికి కొత్తగా వచ్చానని, తాను వచ్చేసరికే రోడ్డుపై కంప వేసి ఉందన్నారు. పంచాయతీ రికార్డుల్లో మాత్రం రోడ్డు లేదని, గ్రామస్తులు మాత్రం పూర్వకాలం నుంచి రోడ్డు ఉందని చెబుతున్నారని తెలిపారు.

ఇప్పుడు రోడ్డు లేదంటే ఎట్లా..

వందేండ్ల నుంచి ఈ ఊరికి ఇదే రోడ్డు. ఇప్పుడు ఈ రోడ్డు లేదంటున్నరు. ఎవరిని కలిసినా మాకు న్యాయం జరగడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మాకు న్యాయం చేయాలి. మా రోడ్డును మాకు కల్పించాలి. అది పూర్తిగా రోడ్డే. ప్రైవేట్ భూమి అసలే కాదు.
- మామిడి నర్సయ్య, కొత్తూరు (ధర్మారం మండలం)

నా చిన్నప్పటి నుంచి రోడ్డు ఉన్నది

నేను ఇక్కడే పుట్టిన. ఇక్కడే పెరిగిన. నా చిన్నప్పటి నుంచి ఇదే దారిపై నుంచి మా ఇంటికెళ్లిన. ఏడాదిన్నర నుంచి ముళ్ల కంప వేసి ఈ రోడ్డును మూసేశారు. రోడ్డు లేదంటున్నారు. చాలా ఇబ్బందిపడుతున్నం. రోడ్డు పక్క వేరేవాళ్ల ఫ్లాట్‌లో నుంచి వెళ్తున్నం. మమ్ముల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. సీసీరోడ్డు అయ్యిందని సంబరపడ్డాం. కానీ అసలు రోడ్డుకే ఎసరొచ్చింది.
- ఆవుల లక్ష్మి, గృహిణి, కొత్తూరు (ధర్మారం మండలం)

పడరానిపాట్లు పడుతున్నం

ఏడాదిన్నర నుంచి పడరానిపాట్లు పడుతున్నం. కానీ మా రోడ్డును క్లియర్ చేయడం లేదు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌ను కలిసినం. పోలీస్‌స్టేషన్ల కూడా ఫిర్యాదు చేసినం. నేను పుట్టుక ముందటి నుంచి ఉన్న రోడ్డు ఇప్పుడు లేదంటున్నరు. ఇదెక్కడి న్యాయం అంటే తిడుతున్నరు. అధికారులు మాకు న్యాయం చేయాలి.
- మామిడి శ్రీనివాస్, కొత్తూరు (ధర్మారం మండలం)

కుమ్మరికుంటలో చిరుతల రామాయణం ప్రారంభం

జూలపల్లి, మార్చి 30 : కుమ్మరికుంటలో శ్రీ రామాంజనేయ భక్త మండలి ఆధ్వర్యంలో ఆదివారం 'చిరుతల రామాయణం' నాటక ప్రదర్శన ప్రారంభించారు. తొలి రోజు సీతారాముల కల్యాణం ఘట్టం కనుల పండువగా ప్రదర్శించారు. మహిళలు మంగళహారతులతో తరలి వచ్చారు. కల్యాణం తిలకించారు. సోమవారం కిష్కింధకాండ-వాలి వధ, మంగళవారం యుద్ధకాండ-రావణ వధ, బుధవారం శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహించనున్నారు. శ్రీరాముడుగా కుంట రాజేశ్వర్‌రెడ్డి, సీతాదేవిగా బండారి లచ్చయ్య, లక్ష్మణుడుగా సాదుల రాజయ్య, భరతుడుగా కామ రాజు, దశరథుడుగా కొత్త లచ్చయ్య, హన్మంతుడిగా నల్లతీగల కోటేశ్వర్, విశ్వామిత్రుడుగా దిడ్డి శ్రీనివాస్, రావణుడుగా శాతళ్ల కాంతయ్య, వాలిగా తుమ్మ మధు తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేచినేని సంతోశ్‌రావు, మాజీ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

మృతి చెందిన ఎద్దు

ఓదెల, మార్చి 30: ఓదెల మండల కేంద్రానికి చెందిన బుద్దె కుమారస్వామి రైతుకు చెందిన ఎద్దు ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు తెలిపారు. వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండడం వల్ల ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో రూ. 50వేల వరకు నష్టం జరిగినట్లు రైతు పేర్కొన్నాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎద్దు మృతి చెందినట్లు ఆరోపించారు. అనేక మార్లు విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్న ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద రక్షణ చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిక్కిరిసిన మల్లన్న ఆలయం

ఓదెల: మేకల బండి రథంతో ఆలయానికి వచ్చిన భక్తులు

ఓదెల, మార్చి 30: ఓదెల మల్లికార్జున్‌స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉగాది పర్వదినాన ఇక్కడ జాతర ప్రారంభమవుతుంది. జాతర ప్రారంభం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర వాహనాలను భక్తులు పూజలు చేయించారు. ఉగాది రోజున వాహనాలకు పూజలు చేయించుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తున్నది. తొలి రోజు దాదాపు 10వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు అంచనా.

ప్రధాన ఆకర్షణగా మేకల బండ్లు..

మల్లన్న ఆలయానికి పలువురు భక్తులు మేకలతో బండ్లను కట్టుకుని రావడం ఆకట్టుకుంది. హరిపురం, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు, పలువురు యాదవులు మొక్కు ప్రకారం మేకలతో బండ్లను కట్టుకొని వచ్చారు. ఏటా మేకలతో బండ్లు కట్టుకొని రావడం ఆనవాయితీగా వస్తున్నదని పేర్కొన్నారు.

కొలనూర్ పురాతన ఆలయంలో..

కొలనూర్ శివారు గుట్టల్లోని అతి పురాతన మల్లన్న ఆలయంలో పూజలు వైభవంగా నిర్వహించారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. కొలనూర్‌తో పాటు గోపరపల్లి, హరిపురం, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆదివరాహస్వామి సన్నిదానంలో భక్తుల కిటకిట..!

కమాన్‌పూర్, మార్చి 30: మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి, జూలపల్లిలోని మలికార్జున స్వామి క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివరాహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్దపల్లి చెందిన వెన్నెల శ్రావ్య – దినేశ్ ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను పుట్ట మధు ప్రారంభించారు.

'విశ్వావసు'లో ప్రజలకు విజయాలు వరించాలి

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- రాజగృహలో సర్వమతస్తులతో ఉగాది వేడుకలు

సర్వమతస్తులతో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్న పుట్ట మధూకర్ దంపతులు

మంథని, మార్చి 30: శ్రీ విశ్వావసు నామ నూతన సంవత్సరంలో ప్రజలందరికీ విజయాలే వరించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆకాంక్షించారు. ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని రాజగృహలో హిందు, ముస్లిం, క్రైస్తవులతో కలిసి ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ దంపతులు షడ్రుచుల ఉగాది పచ్చడిని, బూరెలను అందరికి అందజేశారు. ఆనంతరం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. ఉగాది షడ్రుచుల పచ్చడి మాదిరిగా అన్ని కులాలు, మతాల ప్రజలు కలిసి మెలసి జీవిస్తూ కష్ట సుఖాల్లో పాలుపంచుకోవాలని ఆయన కోరారు. కొత్త సంవత్సరంలో మంథని నియోజకవర్గం ప్రజలందరికీ మంచే జరగాలని దేవుడిని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మంథని నియోజకవర్గంలోని రైతులకు సరిపడా సాగు నీరు అంది పంటలు సంవృద్ధిగా పండేలా భగవంతుడి సాకారం అందాలన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా మంథని నియోజకవర్గ ప్రజలకు తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ, ముస్లీం, క్రైస్తవ కులస్థులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అయినా మారలేదు

- నో పార్కింగ్ బోర్డు పెట్టినా లాభం లేదు
- కన్నెత్తి చూడని ట్రాఫిక్ పోలీసులు

నో పార్కింగ్ బోర్డు ఎదుటనే యథేచ్ఛగా వాహనాల పార్కింగ్

కోల్‌సిటీ, మార్చి 30: గోదావరిఖని ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కూరగాయల మార్కెట్ ఎదురుగా గల పండ్ల దుకాణాల వద్ద పరిస్థితి మారడం లేదు. పండ్ల దుకాణాలకు వచ్చే వారంతా రోడ్డుపైనే అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ప్రధాన రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే గాకుండా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇటీవల 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'పండ్ల దుకాణాలతో పరేషాన్...' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన రామగుండం ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడు పండ్ల దుకాణాల ఎదుట 'నో పార్కింగ్' బోర్డులు ఏర్పాటు చేశారు. మళ్లీ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో పరిస్థితి ఎప్పటి లాగే కొనసాతున్నది. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోసారి అటుగా ఆర్టీసీ బస్సులైతే వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. పండ్ల దుకాణాల వల్ల రోడ్డు పూర్తిగా ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని పలువురు వాపోతున్నారు. ఎదురుగా సీతానగర్ బోర్డు వద్ద కూడా ఇదే సమస్య తాండవిస్తున్నది. ట్రాఫిక్ పోలీసులు గానీ, బల్దియా అధికారులు గానీ ఇప్పటికైనా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి రాజేశ్ థియేటర్ వరకు ఇరువైపులా పుట్ పాత్ మళ్లీ ఆక్రమణకు గురవుతున్నది.

యాదవులు అన్నిరంగాల్లో ముందుండాలి

పురస్కార గ్రహీతను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

- అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్

పెద్దపల్లి రూరల్, మార్చి 30: సమాజంలో నిలదొక్కుకోవాలంటే యాదవులు అన్ని అన్నిరంగాల్లో ముందుండాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉగాది పురస్కారాల ప్రధానోత్సవానికి ఆయన హాజరయ్యారు. మొదటి సారిగా జిల్లాకు వచ్చిన ఆయనను అఖిల భారత యాదవ మహాసభ నాయకులు ఘనంగా సన్మానించారు. అంతకు ముందు వేద పండితుడు శ్రీనివాసాచార్యులు శ్రీ కృష్ణుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లా డారు. జిల్లాలో యాదవ సామాజిక వర్గం బలంగా ఉం దన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో కనీసం ఒక ఎమ్మెల్యే స్థానం అయినా దక్కించుకునేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేయాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి అతిథులు ఉగాది పురస్కారాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జేకే శేఖర్ యాదవ్, మహేందర్ నాథ్ యాదవ్, పోచబోయిన శ్రీహరియాదవ్, గంట రాము లు యాదవ్, కన్నెబోయిన ఓదెలు యాదవ్, మేకల మేల్లేశం యాదవ్, మారం తిరుపతి యాదవ్, వేల్పుల నాగరాజు యాదవ్, శిలారపు పర్వతాలు యాద వ్, అట్ల సాగర్ యాదవ్, పొలగాని సతీష్ యాదవ్, వేల్పుల కుమార్ యాదవ్, పోసాని శ్రీనివాస్ యాదవ్, బత్తిని లక్ష్మణ్ యాదవ్, మంద భాస్కర్ యాదవ్, నర్లపోల్ రాజు యాదవ్, పెంట రవి యాదవ్, కొండ రవి యాద వ్, ఆవుల రాజేశ్ యాదవ్, చెల్కల జితేందర్ యాదవ్, మల్లెత్తుల నాగరాజు యాదవ్, మేకల రాజేశం యాదవ్, పోలం నరేశ్ యాదవ్, సలేంద్ర రాజయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కెనాల్‌లో గల్లంతైన చిన్నారి మృతి

రామగిరి, మార్చి 30: మండలంలోని లొంకకేసారం గ్రామ శివారులో గల ఎస్సారెస్పీ కెనాల్‌లో పడి గల్లంతైన రెండేళ్ల చిన్నారి మృతి విషాదాంతంగా మిగిలింది. పండుగ పూట ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఆదివారం ఉదయం కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. శనివారం మధ్యాహ్నం ఎస్సారెస్పీ కెనాల్ రోడ్డుపైన ఆడుకుంటూ దాస్ గెల్లి (2) అనే చిన్నారి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడిపోయింది. శనివారం రాత్రి కెనాల్‌లో నీటి విడుదలను నిలిపివేసి వెతికినా దొరకలేదు. తిరిగి ఆదివారం ఉదయం సహాయక చర్యలు కొనసాగిస్తుండగా కెనాల్‌లో ప్రమాదం జరిగిన స్థలం నుంచి సుమారు 700 మీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

రామగిరి, మార్చి 30: ఉగాది పండుగను పురస్కరించుకొని సింగరేణి ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-2లో డ్రిల్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఎలువాక జగదీష్ కల్వచర్ల గ్రామంలోని కొమురమ్మ కుటుంబానికి సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి మాట్లాడారు. కొమురమ్మ నివసించడానికి సరిగా ఇల్లు కూడా లేదు. భర్త మరణించగా తమ్ముడి సహకారంతో కూలీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నదని తెలిపారు. వీరి కుటుంబ పరిస్థితిని మేకల మారుతి యాదవ్‌కు వివరించగా తన మిత్రుడు జగదీష్ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువ బలగం సభ్యులు మేకల మారుతి, మల్లేష్‌గౌడ్, రాజు, బూడిద రాజేందర్, తంగల్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ

విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, మార్చి30: పట్టణంలోని అయ్యప్పదేవాలయం సమీపంలో రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదివారం ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశంలో అనేక యూనివర్సిటీల్లో వైస్ చాన్స్‌లర్‌గా పనిచేశారని, దేశంలో అనేక విద్యా సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. ఏటా రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అయ్యప్పదేవాలయంల చౌరస్తాలో మానస గంగోత్రి వాటర్ ప్లాంట్ సౌజన్యంతో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు త్రాగునీరు అందజేయడం అభినందనీయమన్నారు. ఇక్కడ ఎంఈవో సురేందర్ కుమార్, నాయకులు సాధుల వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, మనుమంతు, రాంరెడ్డి, ఆగయ్య, మహేందర్‌రెడ్డి, రామస్వామి, ప్రవీణ్, కనకయ్య, కిషన్‌రెడ్డి, సంపత్ రెడ్డి, రాజు, తిరుపతి, ఫణింధర్, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

నెమలి అప్పగింత

ఓదెల, మార్చి 30: జీలకుంట గ్రామంలోకి వచ్చిన జాతీయ పక్షి నెమలిని గ్రామస్తులు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామ శివారులోని గుట్టలు, అటవీ ప్రాంతం నుంచి నెమలి గ్రామంలోకి వచ్చినట్లు తెలిపారు. దీంతో గ్రామస్తులు బ్లూ కోల్ట్స్ పోలీసులు శంకర్, రామకృష్ణకు తెలపడంతో వారు వచ్చి నెమలిని స్వాధీనం చేసుకున్నారు. ఆ నెమలిని వెంటనే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తిరుపతికి అప్పగించారు.

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన

కోల్‌సిటీ, మార్చి 30: రంజాన్ పర్వదినం సందర్భంగా గోదావరిఖనిలోని పలు ఈద్గాలను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఆదివారం సందర్శించారు. అక్కడ రంజాన్ వేడుకలకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ముస్లింలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని మత పెద్దలకు సూచించారు. ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్లు, ముస్లిం మైనార్టీ నాయకులు ఉన్నారు.

ఒగ్గు కళాకారుడికి పురస్కారం

మంథని రూరల్, మార్చి 30: మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు కావటి భూమయ్య యాదవ్ కు ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉగాది పురస్కారాలు అందించారు. ఈ పురస్కారాల్లో ఒగ్గు కళాకారుడిగా విశిష్ట సేవలు అందిస్తుండడంపై సాంస్కృతిక కళా రంగంలో భూమయ్య యాదవ్‌కు ఉగాది పురస్కారం అందజేశారు. కావటి భూమయ్యకు ఉగాది పురస్కారం రావడం పట్ల మండలంలో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హిందూ సమాజం ఐక్యతను చాటాలి

ఉగాది పచ్చడి పంపిణీని ప్రారంభిస్తున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

కోల్‌సిటీ, మార్చి 30: పండుగల ప్రాశస్త్యాన్ని కాపాడుకుంటూ హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఉగాది పండుగ విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో సందర్భంగా ఆదివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దంపతులు ముఖ్యతిథిగా హాజరై పచ్చడి పంపిణీ ప్రారంభించారు. వీహెచ్‌పీ కార్యదర్శి అయోధ్య రవీందర్, బజరంగ్ దళ్ నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్, మోడెం సురేందర్, వెంకటస్వామి, పొన్నం అంజయ్య, బండ సమ్మన్న, మునగాల సంపత్, పిన్నింటి శ్రీనివాస్, మునుకుంట్ల శ్రీనివాస్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి విస్తృత ఏర్పాట్లు

కోల్‌సిటీ, మార్చి 30:గోదావరిఖనిలోని ప్రధాన శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్య తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు ఉంటాయని వివరించారు. 12న హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

కాల్వశ్రీరాంపూర్‌లో ఇఫ్తార్

ఇఫ్తార్‌లో పాల్గొన్న దాసరి మనోహర్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్, మార్చి30: రంజాన్ సందర్భంగా కాల్వశ్రీరాంపూర్‌లోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొం దిస్తాయన్నారు.. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, బీఆర్ఎస్ నాయకులు దేవయ్య, నరెడ్ల సదయ్య, జక్కె రవీందర్, పలువురు నాయకులు, ముస్లింలు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

మంథని/పెద్దపల్లి/కోల్‌సిటీ/ధర్మారం/కాల్వశ్రీరాంపూర్, మార్చి 30: జిల్లాలో శ్రీ విశ్వావసు నామ సం వత్సరాది ఉగాది వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రజలు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఉగాది పచ్చడి తయారు చేసుకొని కుటుంబ సమేతంగా సేవించారు. అనంతరం స్వీట్లు, బూరెలతో పాటు పిండి వంటలను తయారు చేసుకొని పండుగను ఘనంగా జరుపుకున్నారు. బంధువులు, మిత్రులకు సోష ల్ మీడియా శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయాలు, తమ ఇళ్లల్లో పలువురు వేద పండితులు పంచాగ శ్రవణం నిర్వహించారు.

పెద్దాపూర్‌లో ఎడ్ల బండ్ల పోటీలు

బహుమతులు అందజేస్తున్న సంకెండ్ల లక్ష్మణ్, నాయకులు

జూలపల్లి, మార్చి 30 : పెద్దాపూర్‌లోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల పోటీలు ఏర్పాటు చేశారు. అంతరించిపోతున్న గ్రామీణ కళలను భవిష్యత్ తరాలకు అందించడానికి ఏటా పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో తమ్ముడి ప్రవీణ్, ద్వితీయ స్థానంలో పెసరు రాజు, తృతీయ స్థానంలో రెడ్డిమల్ల కాంతయ్య నిలిచారు. వీరికి వెండి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో తొగరు శ్రీనివాస్, ఇస్కిల్ల మనోహర్, పెసరు రమేశ్, మూడంపెల్లి స్వామి, అరికోల్ల శంకర్, మామిడిపెల్లి చంద్రశేఖర్, గుర్రం స్వామి, చెరుకు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖని అర్చకుడు వెంకటేశ్వరశర్మకు ఉగాది పురస్కారం

గోదావరిఖని, మార్చి 30: శ్రీ విశ్వవసు నామ సంవత్సరం ఉగాది -2025కు గాను గోదావరిఖనికి చెందిన చెందిన వొజ్జల వెంకటేశ్వరశర్మకు ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర సాంస్కృతికశాఖ, దేవాదాయ ధర్మా దాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడు కల్లో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి చేతుల మీదుగా వెంకటేశ్వరశర్మ నగదు రూ.10,116 ప్రోత్సహంతో ఉగాది పురస్కారం అందుకున్నారు. గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలోని శ్రీకాశీవిశ్వేశ్వర శివాలయం ప్రధాన అర్చకుడిగా కొనసాగుతున్న వొజ్జల వెంకటేశ్వర్‌శర్మ ఆలయంలో 35 ఏళ్లుగా పంచాంగ పఠనం చేస్తున్నారు. ఏడాది ఉగాది పురస్కారం లభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉగాది విశ్వావసు సంవత్సరం ప్రజల మధ్య ప్రేమానురాగాలను కలిగించనున్నట్లు తెలిపారు.